


(గత సంచిక తరువాయి)

## 12

మదన్ నిజస్వరూపం సత్యవతిలో తీవ్రసంచలనం, తీరని వేదన కలిగించిందనే చెప్పవచ్చు. ఏంచేయాలి? అతన్ని వదిలి విడిగా వుండటమా కలిసి బ్రతకడమా అన్న సమస్య ఆమెని నిరంతరమూ వేధించసాగింది.

'ఇన్నాళ్ళూ అటు ఆఫీసులోను, ఇటు ఇంటిదగ్గర అన్యోన్య దంపతులుగానే మెలుగుతూ వచ్చారు. ఇప్పుడు ఒక్కసారి విడిపోతే లోకం ఏమనుకుంటుంది? ఎన్ని కారుకూతలు కూస్తుంది? తన బ్రతుకు పదిమందిలోనూ పలుచవైపోతుంది. కనుక తన ఖర్మ ఇంతేనని అతనితో పైకి కలిసి జీవిస్తున్నట్లు భార్యగానే జీవించాలి. అంతరంగికంగా దగ్గరకి చేరనీయకూడదు' అన్న నిర్ణయానికి వచ్చేసరికి ఆమెకి నాలుగురోజులు పట్టింది. ఆనాడు తప్ప మళ్ళీ పరుషంగా ఏమీ సత్యవతి

అనకపోవడంతో ఎక్కడలేని ధైర్యమూ వచ్చింది. ఈ దేశంలో ఆడపిల్ల భర్త ఎలాంటివాడైనా, ఆర్థిక సమస్య వల్లనో, అందకోసమో భర్తని వదులుకోక ఎన్ని బాధలైనా భరిస్తారు. సత్యవతిమాత్రం అలాంటిది కాదూ? చూస్తూ చూస్తూ తన నీడ ఎలా వదులు కుంటుంది? ఈ ఆలోచన రాగానే అతనికి తగని హుషారు వచ్చింది. ఈ రోజు కాకపోతే రేపు తనకి లొంగక పోదు. వయసులో ఉన్న ఆడది. కోరికలను బెట్టుకోసం ఎన్నాళ్ళు చంపు కుంటుంది? ఆడదాని బెట్టు కొన్నాళ్ళు! అంతే!' అనుకున్నాడు మనసులో.

రోజూ ఇంటర్వల్ టైములో కలిసి కాఫీహౌసుకు వెళ్లే దంపతులు, ముభావంగా ఎక్కడికీ వెళ్ళకుండా సత్యవతి సీటునే అంటిపెట్టుకుని ఉండటం చూసి ఆఫీసులో చాలామంది ఆశ్చర్య పోయారు. సత్యవతికి వేవిళ్ళని కొందరు, అబ్బే తగాదా లాడుకున్నారని కొందరు, రకరకాలుగా ఊహాగానాలు చేయసాగారు.

ఇన్నాళ్లూ సత్యవతికి సీత, పిల్లల సంగతి తెలియదు గనక వారాని కోసారి వెళ్ళవస్తూ వుండే మదన్ సత్యవతికి అంతా తెలిసిపోయాక బాహాటంగా దినం మార్చి దినం వెళ్ళసాగాడు. అన్నీ గమనిస్తూనే వుంది సత్యవతి. అయినా ఏమీ మాట్లాడలేదు. వంచిన తల ఎత్తకుండా, ఎవరితోనూ మాట్లాడకుండా తనపని తను చేసుకుపోయే సత్యవతిని చాలా జాగ్రత్తగా గమనించాడు సుధీర్ వారంరోజులు.

ఆమె ఫైల్ తెప్పించి ఆమె రికార్డంతా పరిశీలించి ఆమెకి ప్రమోషన్ ఇవ్వడం అవసరం అని గ్రహించి పాతిక రూపాయలు పెంచినట్లు ఆర్డరు టైపు చేయించాడు. సాయంత్రం నాలుగు గంటలకు ఆమెని గదిలోకి పిలిచాడు.

"మీ వర్కు నాకు చాలా సంతృప్తి కలిగించింది. పనిమీద మీకున్న శ్రద్ధ చాలా ప్రశంసనీయమైంది. అందుకనే మీకు ఈ నెలనించి పాతిక రూపాయలు పెంచుతున్నాను" అంటూ కాగితం అందించాడు.

"థాంక్స్! మెనీ మెనీ థాంక్స్" అని కాగితం పర్సులో పెట్టుకుని బయటికి వచ్చేసింది.

"ఏమిటి, ఆయన అంటున్నాడు?" అనడిగాడు మదన్ ఆత్రంగా.

"మీ విషయం కాదు". అంటూ జవాబిచ్చి వెళ్ళిపోయింది అవతలికి.

అతని కిప్పుడు ఒకటే ఆలోచన! ఎలా తను మేనేజర్ అవడం?

సత్యవతి జీతం పెంచినట్టు భర్తతో చెప్పలేదు. వెనక తనుండి వచ్చిన గది ఖాళీ అయిందని తెలిసి ఆ గది ఇమ్మని వెళ్ళి అడిగింది ఇంటావిడని.

"వెనక నువ్వున్నప్పటికంటే అద్దె పదిరూపాయలు పెంచాం అమ్మాయి" అందావిడ.

"ఫర్వాలేదు, ఇస్తానులెండి" అంది చిరునవ్వు నవ్వుతూ.

ఆవిడేం అనలేదు. ఆ మర్నాడే అడ్వాన్సు ఇచ్చి వచ్చింది. సామానులన్నీ పాక్ చేసింది.

"ఎక్కడికి సత్యా?" అన్నాడు మదన్ తెల్లబోతూ.

"వెనకవున్న గదిలోకి."

"ఈ ఇల్లు బాగానేవుందిగదా; ఖాళీ చెయ్యడం దేనికి?"

"ఇల్లు బాగున్నా అద్దె ఇచ్చుకోవద్దూ!"

"ఇన్నాళ్ళనించీ ఇస్తూనే వున్నాం గదా!"

"ఇన్నాళ్ళూ అంటే పరిస్థితులన్నీ ఒక్కలా వుండవుగదా!"

ఆ రాత్రి ఎనిమిదయ్యేసరికి ఇల్లు మారిపోయింది సత్యవతి. ఈ మార్పు అతనికి బొత్తిగా ఇష్టంలేదు.

ఆ తెల్లవారి లేస్తూనే ఫాన్‌తీసి ఇవతల వుంచి "ఇది మీ ఫాను, మీరు తీసికెళ్ళి మామూలుగానే ఆ యింట్లో పెట్టుకోండి" అంది.

"వుండనియ్;ఇన్నాళ్ళనించీ ఇక్కడే ఉంటోందిగదా!"

"అందుకనే దాన్ని దాని స్థానంలో ఉంచేయమంటున్నాను." మరోమాటకవకాశం ఈయకుండా రిక్షా పిలిచింది.

"ఎక్కడికి వెళ్ళాలో మాట్లాడుకొని తీసికెళ్ళండి" అంది.

ఆ కంఠంలోని స్థిరత్వానికి జడిసి ఫాన్‌తీసుకుని రిక్షామీద వెళ్ళిపోయాడు.

ఇల్లు చేరగానే "మనం సీలింగ్‌ఫాన్ కొనుక్కున్నాంగా, మళ్ళీ ఇదెందుకు, అమ్మేయండి," అని రుసరుసలాడింది సీత.

ఆ నెల్లో జీతం తీసుకున్న సత్యవతి మామూలుగా భర్త చేతికి ఇచ్చేయలేదు. ఇంటి అద్దె ఇచ్చి సరుకులన్నీ తనే స్వయంగా తెచ్చుకుంది. జీతంలో కొంతయినాఇవ్వకపోతుందా అనుకున్న మదన్‌కి పచ్చి వెలక్కాయ గొంతున పడినట్లయింది.

ఇద్దరి జీతాలున్నాయిగదాని సీలింగ్ ఫాను, కొత్త రేడియోసెట్టు ఇన్‌స్టాల్‌మెంట్సుమీద తీసుకున్నాడు అతని శలవలయిపోయి జీతం నష్టంతో మరికొన్ని శలవలానెలలో పెట్టేసరికి అన్నివిధాలా అతని పని ఇరుకున పడింది.

తన సంసారానికన్నీ తెచ్చుకోగా ఓ పది రూపాయలు చేతిలో వుంచుకుని అదనంగా పెంచిన జీతండబ్బు పాతిక రూపాయలూ బ్యాంక్‌లో వేసుకుంది సత్యవతి.

ఇంటిఅద్దె, ఇన్‌స్టాల్‌మెంట్లు కట్టాల్సి వచ్చేసరికి కుటుంబం గడవడానికి ఆ నెల్లో అదనంగా ఓ యాభై అప్పు చేసాడు.

సీత మళ్ళీ గర్భవతి అయింది. సత్యవతితో సంసారసుఖం పూర్తిగా దూరం అయ్యాక సీతనే ఆశ్రయించాల్సి వచ్చేసరికి చంటిపిల్లకి ఆర్నెల్లు వచ్చే సరికి ఆమె మూడుమాసాల గర్భిణి అయింది. "నాకు నీరసం, గుండె దడ. మందులు, పాలు, పళ్ళు బాగా తీసుకో వాలి, డబ్బు ఇవ్వండి," అని రోజూ సీత సతాయింపు.

ఎలాగైనా తను మేనేజరు అవ్వాలి. ఈ సుధీర్‌కి సత్యవతిని ఎలా సమ కూర్చడం; ఇతనికీ ఆడపిల్లలంటే మోజు అని కర్ణాకర్ణిగా విన్నాడు. తనను చూస్తుంటేనే ముఖం మాడ్చుకుంటున్న సత్యవతిని ఎలా ఇతనికి ఎరవేయడం? ఎలాగైనా ఆమెతో బాగా కలిసిమెలిసి ప్రవర్తించాలి. ఆమె కసిరికొట్టినా మెల్లగా లొంగదీసుకోకపోతే ఇంక జీవి తానికి ముక్తి లేదు. ఇలా అనుకున్నాక, సత్యవతి మామూలుగా ఆఫీసునించి వచ్చాక కాఫీ త్రాగుతూంటే "జరిగిం దేదో జరిగిపోయింది. నేను నా కుటుంబం సంగతి చెప్పకుండా నిన్ను పెళ్ళిచేసు కోవడం తప్పే, కాదనను. లోకంలో చాలామంది రెండు పెళ్ళిళ్ళు చేసుకుంటు న్నారు. వారంతా సుఖంగా కాపురాలు చేసుకోవడంలేదా; వారంతా అన్యో న్యంగా వుండటంలేదా? సీత ఏనాడూ నీ విషయం తెలిసినా నా కానందం కలిగించడంలో లోటుచేయలేదు. నా సుఖం తన సుఖంగా భావించి సర్దుకుని పోలేదా?"

"ఆవిడ మహా పతివ్రతగదా; అందు కని మహా సాధ్విలా మిమ్మల్ని పూజి స్తుంది. మరి నేను కాదే. బజారుమని షిని. నాకా ఔదార్యమూ, సహృదయమూ ఎక్కడినించి వస్తాయి?"

"ఏమిటా మాటలు; నువ్వు బజారు మనిషివని ఎవరన్నారు? నా భార్యవి. లేనిపోనివన్నీ ఊహించుకుని నీ మనస్సు గాయపరచుకుంటూ నన్ను బాధించకు."

"క్షమించండి. ఇలా మాట్లాడితే మీకు కష్టంగా వుంటున్నట్టుంది. దయ చేసి నన్ను పలకరించకండి ఇలాంటి ప్రశ్నలతో. అన్నట్టు అడగడం మర్చి పోయాను. సీతకి ముగ్గురూ అమ్మా యిలే ననుకుంటాను. వాళ్ళపేర్లేమిటి?" అంది రాని నవ్వుతెచ్చుకుంటూ.

"పెద్దపిల్ల పేరు సావిత్రి, రెండో పిల్లపేరు జమున, మూడోపిల్ల పేరు కాంచన." హుషారుగా జవాబిచ్చాడు.

"ఏమిటో అంతా ఆడపిల్లలే అయ్యారు. ఒక్కడన్నా మగపిల్లాడు పుడతాడేమోనని ఆశపడుతూంటే ఆడ పిల్లలే పుట్టారు అంతా; అసలు నేను పొరపాటు చేసాను. గర్భనిరోధాన్ని పాటించకుండావుంటే నీకు అంతా మగ పిల్లలే పుట్టివుండేవాళ్ళేమో!"

"మళ్ళీ నా బ్రతుక్కి వాళ్ళెందుకు లెండి. మీరు చేసిన ఉపకారం ఏదన్నా

నాకు ఉంటే పిల్లలు కలగకుండా చూడటమే!"

మదన్ మౌనం వహించాడు.

మరో ఆర్నెల్లు తిరిగిపోయాయి కాలగర్భంలో. సీతకి మగపిల్లాడు కలగలేదు సరిగదా ఆడపిల్లలు కవలలు పుట్టారు. దాంతో పూర్తిగా హతాశు డయ్యాడు. ఆపరేషన్ చేయిద్దామను కుంటే మళ్ళీ ఆడపిల్లలే పుట్టారే, అని దిగులుపడ్డాడు. అప్పులు పెరుగు తున్నాయి. సత్యవతి ఒక్క పైస ఇవ్వడంలేదు. అతన్నడగటంలేదు. ఎన్నివిధాల ప్రయత్నించినా ఆమెతో దాంపత్యసుఖం అనుభవించలేక పోయాడు. అక్కడున్నరోజు విడిగానే గడపడంతప్ప కలిసి నిదురించే అవ కాశం కోల్పోయాడు. అయినా సత్య వతికెందుకంత పట్టుదల అనికూడా ఆశ్చర్యపడ్డాడు మనసులో.

ఎన్నాళ్ళకీ సుధీర్ తనని మేనే జరుగా నియమించకపోవడంతో ఒక రోజు తనే వెళ్ళి అడిగాడు మెల్లగా.

''చూద్దాంలే; దానికింకా స్పెషల్ క్వాలిఫికేషన్లుండాలి. తర్వాతచూద్దాం లెండి,"అన్నాడు దాటించేస్తూ.

అయినా అతను తన ప్రయత్నం మానలేదు. తనకి తోచిన విధంగా ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

## 13

ఒకసారి పుట్టింటికి వెళ్ళింది సత్య వతి. రత్నకుమారి పురిటికివచ్చి అక్కడేవుంది. ఆ రాత్రి వెన్నెల్లో అరుగుమీద కూర్చుని పిల్లల్ని ఆడి స్తున్న రత్న అక్కనుచూసి,

"ఇదుగో! ఇది విన్నావూ? ఆ చక్ర పాణిగాడు బి.ఏ. ప్యాసయ్యాడట." స్వరం తగ్గించి అంది.

"ఏ చక్రపాణి ?"

"వాడే, వెనక నిన్ను పెళ్ళాడతలా, మీ ఇద్దరూ విడిపోయారు చూడు." గుర్తుచేస్తూ అంది.

ఉలిక్కిపడింది సత్యవతి. "వాడి మొహం. వాడు బి.ఏ. ప్యాసవడం ఏమిటి?"

"అబద్ధం కాదక్కా; నిజమే!"

"ఆ పల్లెటూరి గబ్బిలాయికి అంత తెలివి పుట్టుకొచ్చిందా?"

"ఆ, పెళ్లాం కూర్చోబెట్టి పగలు, రాత్రి చదివించి ప్యాసుచేయించిందట."

"ఆవిడేం వెలిగించిందేమిటి?''

"ఇంటరు పాసైందట."

"పిల్లలో?"

"ఆ, ముగ్గురో నలుగురో."

"ఇంటరు పాసయ్యా పిల్లల్ని కంటోందన్నమాట.''

''పెళ్ళాం అయ్యాక పిల్లల్ని కనటం కుండా తప్పుతుందా?"

"ఏడిసిందిలే. ఆ పిల్లలుకూడా వాడిలానే ఉండివుంటారు."

"లేదు. ఆ పిల్లలు బాగానే వుంటారట. ఆ పిల్ల చాలా అందమైందీ, తెలివైందీనట.'

"ఆc, మొగిడితో సంసారంచేస్తూ పిల్లల్ని కనేదానికి తెలివితేటలేమిటి? నాలాగా ఉద్యోగంచేసి స్వతంత్రంగా ఓ రూపాయి డబ్బులు సంపాదించమను, దాని తెలివేదో అప్పుడే బయటపడుతుంది."

వారంరోజులు పుట్టింట్లో వుంది సత్యవతి. రోజూ కనకమ్మ గొడవే "డాక్టరుకు చూపించుకోవే తల్లీ! రత్నకిది మూడోకానుపు. పెళ్ళయి నాలుగేళ్ళయినా నీ కడుపు పండలేదు. పెద్దతనంలో పిల్లలు లేకపోతే ఎలా గడుస్తుందే'' అంటూ,

'ఆ, ఈ జన్మకింతే! తనకి తల్లి అయ్యే గీతలేదు,' అని మనసులో అనుకుని పైకి "అలాగేలే" అని జవాబిచ్చి ఇంటికి తిరిగివచ్చింది.

"అబ్బ నాలుగురోజుల్లో వస్తానని వారంరోజులు చేశావు," అంటూ ఆప్యాయంగా పలకరించాడు మదన్. క్షణం మనసులో ఆనందపడినా సీత, పిల్లలు, ఆనాడు అపురూపంగా భార్య భుజం మీద చెయ్యివేసి గేటుదాటించిన మదన్ రూపం కనబడి మనస్సు మళ్ళీ రాయయిపోయింది సత్యవతికి.

చిన్న చిరునవ్వే జవాబుగా లోపలికి వెళ్ళిపోయింది.

"ఈ పూటకి వంటేంచేస్తావు? హోటల్లో భోంచేసివద్దాం రా" అన్నాడు మదన్.

ముందు ఒప్పుకోకపోయినా బస్ ప్రయాణంతో బడలిపోయినట్లనిపించి "భోజనంచేసి వస్తే ఏంపోయిందిలే !" అనుకుని సరేనన్నట్లు తల వూపింది. ఆ మాటకి బ్రహ్మానందపడిపోయాడు మదన్. "నువ్వు రెడీగా వుండు. నేను అరగంటలో వస్తాను, రెండు టవల్స్ కొనుక్కుని" అంటూ గబగబా బయటికి వచ్చాడు.

సత్యవతి స్నానంచేసి, తల దువ్వుకుని, చీరకట్టుకుని సిద్ధంగా వుంది. అతను ఓ గంటలో తిరిగి వచ్చాడు.

రిక్షామీద ఇద్దరూ హోటల్‌కి బయలుదేరారు. ఎయిర్‌కండిషన్ రూంలో అడుగుపెట్టి, "ఉండు టికెట్స్ తీసుకువస్తాను" అంటూ మళ్ళీ బయటికి నడిచాడు.

సత్యవతి లోపలికి వచ్చి ఓ మూలగా కూర్చోబోతూ ఉలిక్కిపడింది. సుధీర్ నవ్వుతూ చేతులు కట్టుకుని కూర్చుని వున్నాడు కుర్చీలో. డైరక్టరు గనక తప్పదని నమస్కారం చేసింది.

"రండి, ఈ సీట్లో కూర్చోండి" అంటూ తన ఎదురుగా సీట్ చూపించాడు సుధీర్. తప్పనిసరయి

కూర్చుంటూ "ఈయనింకా రారేం !" అనుకుంటూ తలుపువంక చూసింది.

"ఎవరికోసం చూస్తున్నావు?" అతని ఏకవచన ప్రయోగానికి విస్తుబోతూ, "మా వారికోసం" అంది.

"వస్తారెండి ! ముందు భోజనం చేయండి" అంటూ సర్వర్ అందించిన ప్లేటు ఆమె ముందుకి జరిపాడు.

"ఆయన టిక్కెట్లు తెస్తానన్నారు. మళ్ళీ వేస్టవవూ ! వద్దులెండి" అంది కంగారు నణచుకుంటూ,

"వేస్టేముంది. ఇంకా నేను టిక్కెట్ తీయలేదులే. తినండి."

భయపడుతూనే ప్లేటు ముందుకు లాక్కుంది. తినకపోతే అసలే డైరక్టరు, ఏమనుకుంటాడో !

మెల్లగా ఆ కబురూ ఈ కబురూ చెప్ప సాగాడు సుధీర్. కాస్త కాస్త కంపనం తగ్గి భోజనం చేయసాగింది సత్యవతి. భోజనం పూర్తయినా మదన్ పత్తా లేడు

"రండి ! నా రూమ్‌లో కూర్చుందురు గాని ! అతను వచ్చాక వెళ్ళిపోవచ్చు!" అంటూ పైకి దారితీసాడు సుధీర్. టిక్కెట్లు తెస్తానన్న మనిషి ఇంతసేపూ రాకుండా ఏమయినట్లు ?

"పైకి రండి" అని మరోసారి పిలవడంతో మెల్లగా అతన్ని అనుసరించింది సత్యవతి.

రూంలోకి అడుగుపెట్టాక ఫాన్ ఆన్ చేసి తలుపు వేసేసాడు సుధీర్.

సత్యవతి ఉలిక్కిపడింది.

అది గమనించిన సుధీర్, "భయ మెందుకు సత్యా !" అంటూ భుజంమీద చెయ్యివేశాడు. అప్పటికి పూర్తిగా అర్థమయింది సత్యవతికి. అతడు కావాలనే టిక్కెట్ల నెపంతో వెళ్ళి పోయాడని, సుధీర్‌కి అప్పచెప్పాడని. ఆమె ఒళ్ళంతా జుగుప్సతో నిండి పోయింది. మదన్‌పట్ల క్రోధమూ, ఏహ్యత ఆ క్షణంలో ఎంత కలిగాయో వర్ణనాతీతం.

ఆమెని దగ్గరకి తీసుకున్నాడు. సత్యవతి తలదించుకుంది. ఆమె కళ్ళు నీళ్ళతో నిండిపోసాగాయి. 'భగవాన్ ! నా జీవితాన్ని చివరికి ఎలా తీర్చి దిద్దావో చూడు. నా భర్తకి నామీద ఎలాంటి సదభిప్రాయం, ఎంతటి ప్రేమలు ఉన్నాయో చూడు' అని మనసులోనే దుఃఖపడసాగింది.

ఆమెని బంధించివేసిన చేతులపై రెండు కన్నీటిబొట్లు రాలడంతో ఉలిక్కి పడిన సుధీర్ ఆమె గడ్డంపుచ్చుకుని తల మెల్లగా పైకి ఎత్తాడు.

"ఏడుస్తున్నావా !" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఏడవక ఎలా నవ్వుకుంటాను ?"

"ఏం, నీ కిష్టంలేదా ?"

లేదన్నట్లు తల ఊపింది సత్యవతి.

చటుక్కున ఆమెని వదిలి కాస్త దూరంగా జరిగాడు సుధీర్.

"మరి మదన్ నీకంత అభ్యంతరా లుండవని చెప్పాడే !"

"చెబుతాడు ! అతను ఎన్నైనా చెబుతాడు. నా బ్రతుకులో అన్నివిధాలా నిప్పులుపోస్తూ తన స్వార్థంకోసం, తన కుటుంబ సుఖంకోసం నన్ను ఎన్ని రకాలుగానైనా ఉపయోగించు కోవాలన్న తపనతో ఎందరితో ఎన్నైనా చెబుతాడు." క్రుద్ధత్వంతో అంది.

"వివరంగా చెప్పు సత్యా ! నేను అన్నీ వింటాను. నా కిప్పుడు వేరే పనేమీలేదు."

సుధీర్ వంక క్షణం చకితయై చూసి అతను తనని పెళ్ళాడడం, సుకుమార్ దగ్గరకి పంపి అసిస్టెంట్ పదవి పొందడం, ఆ తర్వాత బయటపడిన అతని మొదటి సంసారం, అప్పటినించీ తామిద్దరి ప్రవర్తన అన్నీ విపులంగా చెప్పింది సత్యవతి.

వింటున్న సుధీర్ భ్రుకుటి ముడి వడింది. చేతులు బిగుసుకున్నాయి.

"రాస్కెల్ ! ఎంత పనిచేశాడు ! ఆడపిల్ల జీవితంతో ఇంత దారుణంగా ఆటలాడే వ్యక్తిని క్షమించకూడదు." కోపంగా అన్నాడు.

"ఏంచేస్తారు క్షమించక ! మీరూ మగవారేగదా !"

"కావచ్చు ! స్త్రీ అంటే అనుభ వించాలన్న కోరికవున్న వ్యక్తిని కూడా కావచ్చు ! కాని ఇష్టపడివస్తేనే తప్ప అయిష్టత చూపే ఆడదాన్ని పొందాలని నే నేనాడూ అనుకోలేదు. పొందలేదు. అతనికి తగిన గుణపాఠం నేను నేర్పు తాను. నువ్వు ఇంటికి వెళ్ళిపో! "

"రేపు మీ రేమన్నా అతన్ని అంటే అతను నన్ను ఎన్నో హింసలపాలు చేస్తాడు" భయంగా అంది. సుధీర్ క్షణం ఆలోచించి, లెటర్‌పాడ్, పెన్ తీసి ఏదో రాసి ఈ కాగితం నీ దగ్గర ఉంచుకో ! నెల్లూరు ఈ రాత్రికి రాత్రి వెళ్ళిపో ! రేపు ఈ కాగితం చూపించి అక్కడ మన ఆఫీసులో చేరు. రెండు నెలలయినా అక్కడ వుంటే ఈలోగా మదన్ రోగం నేను కుదురుస్తాను." సరే నన్నట్లు తల వూపింది సత్యవతి.

వెంటనే ఆమెని పంపించివేశాడు సుధీర్. అతని మంచితనానికి, సహృద యతకూ హృదయపూర్వకంగా అంజలి ఘటించి అతని పాదాల నంటి నమస్క రించి క్రిందకి దిగిపోయింది సత్యవతి.

అనుకోకుండా ఆమె తన పాదాల నంటి నమస్కరించేసరికి సుధీర్ మనసు ఆర్ద్రతతో నిండిపోయి 'పాపం ! అభాగ్యురాలు' అనుకుని నిట్టూర్చాడు. అప్పటికప్పుడే తన బట్టలు సర్దుకుని తిరుపతి బస్ అందుకుని వెళ్ళిపోయింది



వాళ్ల ఆవిడ సెలక్టు చేసుకున్న చీర ధర ఎంతో అడిగితే చెప్పానంతే...!

సత్యవతి. బస్‌లోనే ఓ కార్డు రాసి పడేసింది ఇంటికి.

## 14

మదన్‌మోహన్ ఒక విధంగా ఆనందంగానూ, మరో విధంగా భయంగాను కూడా ఆఫీసులో అడుగు పెట్టాడు. సత్యవతి ఎక్కడ ఆఫీసులోనే దుమ్మెత్తిపోస్తుందో అని ఓ ప్రక్క భయం వున్నా తన ప్లాన్ ఫలించి తనింక రేపీపాటికి మేనేజరు కాకపోడు అని భుజా లెగురవేసుకున్నాడు మనసులో. ఆ రోజు సత్యవతి ఇంటికి వెళ్ళదలచుకోలేదు కూడా. నాలుగురోజులు వెళ్ళకపోతే ఆమె కోపం చల్లారిపోతుంది. ఒకవేళ చల్లారకపోయినా ఫర్వాలేదు. తనెటూ మేనేజరయిపోతాడు. ఆమె లేకపోతే ఏం ? సీత ఉందిగదా ! ఆమేమన్నా తనని సుఖపెడుతోందా ? తన పోషణక్రింద వుందా ? ఆవిడ సంపాదన ఆవిడగారే గడుపుకుంటోంది గాని ఒక్కపైసా అయినా తనని అడగలేదు. అయినా తను మేనేజరయిపోతే తనక్రిందేగా ఆమె పనిచేసేది ? అప్పుడు లొంగిరాక ఏంచేస్తుంది ? తను మేనేజరయితే తన జీతం పెరుగుతుంది.

ముందు బట్టలకొట్లో బాకీ తీర్చాలి. మొన్న పండుగకి సీతకి, పిల్లలకి అరువు తెచ్చాడు బట్టలు. సత్యవతికి కూడా చీర కొందామనుకుని మరీ ఎక్కువయిపోతుంది బిల్లు అనుకుని వూరుకున్నాడు. సత్యవతీ కొనుక్కోలేదు. సీత క్రొత్తచీరతో తిరిగితే సత్యవతి ఆనాడు పాతచీరే కట్టుకు తిరిగింది. పోనీ అడిగితే కొందాం అను

కున్నాడు. సత్యవతి అడగలేదు అదే సీత అయితే కొనేదాకా వేధిస్తుంది. అలా అడిగి జబర్దస్తీగానైనా సీత కొని పిస్తుందిగాని సత్యవతి ఏనాడూ బలవంత పెట్టలేదు. అయినా సత్యవతికి చాలా పొగరు ! అన్నీ తలపోసుకుంటూ ఆఫీసులో పనిచూసుకోసాగాడు. ఆ రోజు సత్యవతి రాకపోవడంతో ప్రాణం తేలికనిపించింది మదన్‌కి. అతన్ని సుధీర్ ఓరకంటితో గమనిస్తూనే వున్నాడు.

మధ్యాహ్నం మూడింటికి హాల్లో మీటింగ్ వుందట, అందర్నీ హాజరవ మన్నారు, అంటూ ప్రతివాళ్ళకి చెప్పాడు ప్యూన్ వచ్చి.

"దేనికి, దేనికి ?" అని అంతా ఆరాటపడిపోయారు. మూడవగానే అంతా కుతూహలంగా హాజరయ్యారు. సుధీర్ అధ్యక్ష స్థానంలోంచి లేచి నిల బడి. "ఈ రోజు మీ కందరికీ ఒక విచారకరమైన వార్త చెప్పాల్సి వస్తు న్నందుకు విచారిస్తున్నాను. మన ఆఫీసులో పనిచేస్తున్నది, నిదానస్తు రాలు మదన్ భార్య అయిన సత్యవతి అత్మహత్య చేసుకుంది," అంటూ ఆగాడు.

అంతా కొయ్యబారిపోయారు. "అదేమిటయ్యా ! మీ ఆవిడ అత్మ హత్య చేసుకుంటే చక్కగా తాంబూలం నములుతూ ఆఫీసు కొచ్చి అలా హుషా రుగా తిరుగుతావు. నువ్వు మనిషివేనా?" అనడిగారు, ఎదుట సుధీర్‌వున్న మాట కూడా మర్చిపోయి.

అనుకోని ఈ వార్తకి అసలే తెల్ల బోతున్న మదన్ అంతా అలా అడిగే సరికి కంగారుపడిపోయాడు.

"అతన్నడిగితే అతనేం చెబుతాడు! నన్నడగండి నేను చెబుతాను." తాపీగా సుధీర్ అనేసరికి అంతా తెల్లబోయారు. ఆఫీసులో పనిచేస్తున్న వ్యక్తి భార్య చనిపోతే అతనికికాక యజమానికి వివరాలు తెలియడం ఏమిటి అని ఆశ్చర్యపోయారు.

అది గమనించి, "మీ కందరికీ ఇది విడ్డూరంగా వుండవచ్చు ! కాని వినండి చెప్తాను. ఈ మదన్ సత్యవతిని పెళ్ళాడే నాటికి ఇద్దరు పిల్లలు, భార్య వున్న వ్యక్తి. ఆమె అమాయకంగా నమ్మింది ఇతన్ని. ఇతనికి కావలసింది సత్యవతి. ఆమె ప్రేమకాదు. తన కేమాత్రం ప్రతిభ లేకపోయినా పెద్ద ఉద్యోగాలు కావాలన్న ఆరాటం. అందుకు సత్యవతిని ఎరగా వేయాలనుకున్నాడు, వేశాడు. సుకుమార్‌కి ఆమె శీలాన్ని బలిపెట్టి అసిస్టెంట్ అయ్యాడు తర్వాత అతని కుటుంబానంతా కళ్ళారా చూసిన సత్యవతి చిత్రహింసకు గురిఅయింది. చివరికి రాత్రి ఇతను మరో పాడుపని చేయబోతే ఆత్మహత్య చేసుకుంది. ఇలాంటి వ్యక్తిని, ఒక స్త్రీ జీవితాన్ని

తేలిగ్గా భావించి, అభిమానస్తురాలైన ఆమె చావుకు కారణమైన ఇతన్ని ఏం చేయాలి ? ఏం చేస్తే బాగుంటుంది ? మీరే చెప్పండి" అంటూ ఆపేశాడు.

వింటున్న అందరూ ఆశ్చర్యంనించి తేరుకుని "డర్టీ రోగ్ ! ఇలాంటి వ్యక్తిని ఆఫీసులోనే ఉండనీయ కూడదు. పోలీసులకి పట్టించండి," అని కొందరు, "ముందు డిస్‌మిస్ చేయండి" అని కొందరు అరవసాగారు ఉద్రేకంగా.

"స్టాప్ ! ఏదో అతని పిల్లల ముఖం చూసి, సత్యవతి భర్తకదాన్న జాలితో పోలీసులకి అప్పచెప్పకుండా డిస్‌మిస్ మాత్రం చేసేస్తున్నాను," అంటూ చరచరా వెళ్ళిపోయాడు తన గదిలోకి.

మదన్‌కి ముచ్చెమటలుపోసి కాళ్ళూ చేతులు వణకసాగాయి. మేనేజరవ్వాలని కలలూకంటే ఉద్యోగమే ఊడిపోయింది. అందరూ ఛీత్కారంగా అతన్ని చూసి వెళ్ళిపోయా రక్కడినించి.

అప్పుడే అటుగా వచ్చిన ప్యూను "పాపం సత్యవతమ్మగారు పోయారా?" అన్నాడు సానుభూతిగా !

"ఆ! పోయింది పోక నా బతుకు తగలేసి మరీ చచ్చింది." కసిగా అన్నాడు మదన్. అది విన్నాడు సుధీర్, ప్యూనుద్వారా ! అసలలా అడిగించింది అతనే !

ఆఫీసు వదిలారు. అంతా పురుగుని చూసినట్టు చూసి వెళ్ళిపోయారు అతన్ని.

అవమానంతో తలవంచుకున్నాడు మదన్. అంతా వెళ్ళిపోయేదాకా అత నలాగే కూర్చున్నాడు. సుధీర్ ఇంకా గదిలోనే వున్నాడు. మెల్లగా ఆ గదిలో కడుగుపెట్టాడు మదన్. అతను వస్తా డని అతనికి తెలుసు. చూసీ చూడనట్టు వూరుకున్నాడు సుధీర్.

"నాది పొరపాటే సార్ ! కాని ఉద్యోగం పోతే నా పిల్లల్ని పోషించటం కష్టం ! దయచేసి నా ఉద్యోగం నా కీయండి సార్ " అన్నాడు దీనంగా.

"సారీ మిస్టర్ ! నిన్ను చూసి అందరూ ఇలాగే ప్రవర్తిస్తే నాకు చెడ్డ పేరు వస్తుంది ముందు. మా ఆఫీసు గౌరవం మంటకలిసిపోతుంది."

"అలా అంటే ఎలాగండి ! నా కుటుంబమూ, నేను పస్తుంతోనూ మాడి చావాలి !"

"వేరే ఉద్యోగంకోసం ట్రైచెయ్యవోయ్."

"ఈ రోజుల్లో ఎక్కడ దొరుకు తుందండి అంత త్వరగా ఉద్యోగం ?"

"అవును. ఎలా దొరుకుతుంది ? సత్యవతి లేదుగా తనను తాను అర్పించు కుని నిన్ను అందలం ఎక్కించ డానికి ?" కాస్త వెటకారంగా అన్నాడు సుధీర్.

మదన్ తలవంచుకున్నాడు.

"నీకు అంత ఉద్యోగం కావాలంటే అయిదు వేల రొక్కం, లేదా నీకు

చేతవచ్చిన విద్య ఆడది ఏదో సమకూర్చు !"

"నా కెలా వస్తుంది అంత డబ్బు ! తల తాకట్టుపెట్టినా నాకు వందరూపాయ లిచ్చే దాతలెవరూ లేరు. ఇంక స్త్రీ మాత్రం ఎక్కడిది ?"

"అవును మర్చిపోయాను. సత్యవతి లేదుగా. అయినా సత్యవతి లేకుంటేఏం సీత వుందిగా ?" కొంటెగా అడిగాడు కావాలనే !

"ఛ ! సీత అలాంటిదికాదు సార్ ! పైగా అయిదుగురు పిల్లల తల్లి." ఏడుపు ముఖంతో అన్నాడు.

"అలాంటివాళ్ళని ముఖాన రాసి వుంటుందేమోయ్ ! అడిగి చూడు. అయిదుగురు పిల్లలయితేనేం. పదిమంది బిడ్డలను కన్నా నా భార్య దగ్గరికి నేను పోకుండా వుంటానా ? నువ్వుంటావా ? నాకేం అలాంటి పట్టింపులు లేవు." పెంకెగా అన్నాడు సుధీర్. లోలోనే నవ్వుకుంటూ.

తన తెలివితక్కువవల్ల తన బ్రతుకెంత లోకువయిందీ గ్రహించు కున్నాడు మదన్. లేకపోతే ఇంతమంది పనిచేసే ఆఫీసులో అతని భార్య కావాలని ఎవరినన్నా అడుగుతాడా ! ఎంత జారుడైనా అడగడు, అను కున్నాడు మనసులో.

"సీతని అడిగి చూడు, ఆమె ఒప్పు కుంటే రేపు ఉదయం ఆఫీసుకు వచ్చి చెప్పు. లేకపోతే నీ ఖర్మం నీది" అంటూ బయటికి వెళ్ళడానికి ఉద్యుక్తుడయ్యాడు సుధీర్ లోలోనే నవ్వుకుంటూ.

మెల్లగా వెనుదిరిగాడు మదన్

విషణ్ణవదనంతో ఇల్లు చేరుకున్నాడు మదన్. అతనికి సత్యవతి కనబడితే కాల్చిపారేయాలన్నంత కసిగా వుంది. 'చచ్చింది కనక బ్రతికిపోయింది. లేకపోతే చచ్చి వుండేది నా చేతిలో' అనుకున్నాడు. అంతేగాని తన తప్పు ఒప్పుకోడానికి అతనికి మనస్కరించ లేదు.

"అలా ఉన్నారేం ?" అంటూ పలక రించింది సీత.

"ఉద్యోగం కాస్తా ఊడింది. "

"ఉద్యోగం ఊడడమేమిటి ? మేనే జర్నవుతాను రేపు అంటూ ప్రొద్దున చెప్పి వెళ్ళి" ఆశ్చర్యంగా అడిగింది సీత.

"దాని ప్రయత్నంలోనే ఉన్నది కూడా ఊడింది."

"కొండనాలిక్కి మందు పెడితే ఉన్న నాలిక ఊడిందట. అలా వుంది మీ పని. సత్యవతి ఏం సాధించినట్టు ?" అంది సీత

"సత్యవతా ! ఇంకా అదెక్క డుంది ?"

"అయిందీ ! మీ ఉద్యోగం కాస్తా పోయేసరికి ఎవడినో తీసుకుని లేచి పోయిందన్నమాట. ఎలాగైనా నా దారి

నాది, దాని ధోరణి వేరు అని ఇప్పటి కైనా గ్రహించారా! పెళ్ళాన్ని కనక ఉద్యోగంవున్నా లేకపోయినా మిమ్మల్ని అంటిపెట్టుకున్నాను. అదెందుకుంటుంది? డబ్బు లేకపోతే క్షణం వుండదు. ఆ ప్రేమల గొప్ప ఎవడికి తెలియదని." నిరసనగా అంది సీత.

"నువ్వు నోరుమూసుకో! అదెవడినీ తీసుకుపోలేదు ఆత్మహత్య చేసుకుంది."

"ఆత్మహత్యా! ఏం పోయేకాలం వచ్చింది! రేపు పోలీసులు మన కొంప మీద పడరూ?" కంగారుగా అంది సీత.

"పోయేకాలం వచ్చింది కనకే పోయింది. డైరెక్టరు పోలీసుల కప్పగించకుండా దయదలచి ఉద్యోగం మాత్రం ఊడగొట్టి పంపాడు."

"బాగానే వుంది ఉద్యోగంపోతే ఎలా బ్రతుకుతాము? బి. ఏ. అన్నా చదవని మీకు ఉద్యోగం ఎవడిస్తాడు? ఈ పిల్లలనందర్నీ ఎలా పెంచుతాము? అప్పు లెలా తీర్చుస్తాం?"

"అదేగదా నా బాధకూడా దిక్కు తోచకుండాపోయింది."

"కాళ్ళట్టుకుని బతిమాలకపోయారా ఆ డైరక్టరుని?"

"బతిమాలాను! అయిదు వేలో, నిన్నో తేల్చుకుని తన కర్పించ మన్నాడు."

"అడుక్కు తిన్నట్టుంది. అప్పులతో చస్తుంటే మనకి అయిదువే లెలా వస్తాయి?"

"లేకపోతే నిన్ను అతని దగ్గరికి పంపుకోవాలి."

సీత అయిదు నిముషాలు మౌనంగా వుండిపోయింది ఆలోచిస్తూ.

"మీకు అభ్యంతరం లేకపోతే నాకూ అభ్యంతరం లేదు."

"సీతా!" నమ్మలేనట్లు చూశాడు.

"అవును. మన పిల్లల్ని చంపుకుంటామా? మనం పస్తులతో మాడి చస్తామా? వ్యభిచారం నిత్యం సాగిస్తూ పోషించుకునే వారికంటే మనం చాలా నయం. ఒకసారితో తీరిపోతుంది."

"సీతా! నువ్వేనా ఇలా మాట్లాడేది?"

"నేనే! ఎందుకలా కంగారుపడతారు. మన కుటుంబంకోసం మనం తాపత్రయపడటంలో తప్పేమీలేదు ఇంటికి వచ్చిన అతిధులకి సకల ఉపచారాలూ చేసి రాత్రికి వారి సుఖంకోసం భార్యలని పంపిన మగవారు పురాణాల్లో కూడా వున్నారు."

వింటున్న మదన్ మతిపోయిన వాడిలా చూడసాగాడు. 'అయిదో క్లాసు చదివింది, పల్లెటూరిపిల్ల. ఏం తెలియని అమాయకురాలు, భర్త అడుగు జాడల్లో, భర్తసుఖంకోసం తాపత్రయపడే పరమ పతివ్రత అని తానింత కాలం భావిస్తూ వచ్చిన సీత ఇక్ష్వాకుల

నాటి మగవారినించి, అధునాతన కాలం వరకూ ఏకరువుపెడుతోంది.'

అప్రయత్నంగా అతనికి సత్యవతి గుర్తుకు వచ్చింది. ఆనాడు సుకుమార్ త న్ననుభవించాడని ఎన్ని రకాలుగా బాధపడిందీ గుర్తు వచ్చింది. ఇప్పుడు సీత సమర్థింపూ గుర్తు వచ్చింది మళ్ళీ! ఎక్కడ వుంది ఈ తేడా! స్త్రీ మన స్తత్వంలోనూ, చూసే, ఆలోచించే దృక్పథంలోను. అంతేగాని చదువులోనూ, భార్యగానూ కాదు. స్త్రీఎప్పటికీ స్వతంత్రాలోచన చేయగలదీ, స్వయం నిర్ణయాలు చేసుకోగల తెలివైందీని! ఎటొచ్చీ ఆ భావాలు బయటపడనీయంది బహుశా మగవాడేనేమో!"

"సీతా! అత డనుభవించిన నిన్ను తెలిసీ మళ్ళీ ఎలా దగ్గరకు తీసుకోగలను?"

"మరేం ఫర్వాలేదు. మీరు సత్యవతితో ఇన్నాళ్ళనించీ కాపరం వెలిగిస్తే మీ దగ్గరికి రాకుండాపోయానా? పిల్లల్ని కనకుండాపోయానా? నేను సరిపెట్టుకుంది మీ రెందుకు సరిపెట్టుకోలేరు? ఆనాడు మీకు తోచిన న్యాయం, ఈనాడు నాకు మాత్రం ఎందుకు వర్తించదు?" ఈ దెబ్బతో పూర్తిగా మతిపోయింది మదన్‌కి. సీత, సీతేనా ఇన్ని మాటలు మాట్లాడింది?

సత్యవతి చనిపోయి తనని ఓడించింది. సుధీర్ నలుగురిలో చెప్పుచ్చుకు కొట్టినట్టు చేసి ఓడించాడు. ఈ ఇద్దర్నీ మించి చిత్తుగా ఓడించేసింది సీత!

"సరే నీ యిష్టం! రేపతనితో చెప్తాను" అంటూ మెల్లగా అడుగు లేసుకుంటూ గదిలోకి నడిచాడు. "సత్యవతీ! నిన్ను చాలా తేలిగ్గా అంచనావేసి నీతో చెలగాటమాడి నీ చావుకి కారకుడ నయ్యాను. నన్ను మన్నించు" అనుకున్నాడు.

మర్నాడు వెళ్ళి సుధీర్‌కి చెప్పాడు. 'సాయంత్రం సీత వస్తుంది' అని.

సుధీర్ తలపంకించి "రేపు ఆఫీసుకు రా!" అని చెప్పి పంపేసాడు.

మెత్తని సిల్కుచీరలో ముస్తాబయి వచ్చిన సీతని 'నీ కిష్టమయ్యే వచ్చావా?' అనడిగాడు. క్రిందటి రోజు సత్యవతిని అదే టైముకు అదే గదిలో "నీ కిష్టం లేదా!" అని ప్రశ్నించి దూరంగా జరిగిన సుధీర్.

ఆ మర్నాడు అసిస్టెంట్ మేనేజరుగానే పనిలో ప్రవేశించాడు మదన్.

"పాపం! పిల్లలుగలవాడు బతిమాల్తుంటే మళ్ళీ పనిలో చేరమన్నాను," అని చెప్పాడు సుధీర్ అందరికీ.

"డైరక్టరుగారి దెంత జాలిగుండె" అని మెచ్చుకున్నా రంతా!

"నన్ను మేనేజర్ చేయరా?" అనడిగాడు ఆశ చావని మదన్.

"వెరీ సారీ మిస్టర్! ఇది వేయడమే గగనం. చూశారుగా మన స్టాఫ్ అభి

ప్రాయం. పైగా సుకుమార్ మళ్ళీ ఈ బ్రాంచికే వస్తాడు, ఓ నెల రోజుల్లో. అందాకా నేను ఉండి వెళ్ళిపోతాను" అన్నాడు సుధీర్ జవాబుగా.

ఎంతవరకూ ప్రాప్తమో అంతే అని ఊరుకున్నాడు పేలవంగా మదన్.

## 15

సత్యవతి ఉద్యోగంలో స్థిరపడింది నెల్లూరులోనే. తండ్రికి ఉత్తరం రాసి రెండోకంటికి తెలియకుండా సామా నంతా తెప్పించివేసుకుంది.

"ఒక్కసారి తిరుపతి వెళ్ళి వద్దాం!" అన్న అభిప్రాయం కలిగి శెలవు కలిసివస్తే శనివారం అక్కడ ఉండేలా శుక్రవారమే బయలుదేరి వెళ్ళింది.

శనివారం ఉదయమే వెళ్ళి తిరుమ లేశుని దర్శనం చేసుకుని వచ్చింది. సాయంత్రం అలా ఏమన్నా కొనాలని బజారుకి బయలుదేరి ఎదురుగా పిల్లలని నడిపించుకుంటూ వస్తున్న వ్యక్తిని చూసి అట్టే నిల్చిపోయింది. పరీక్షగా చూసి అతనే అని నిర్ధారించుకుని, "నమస్కారం చక్రపాణిగారూ!" అంది కావాలనే పలకరిస్తూ.

అతడు సత్యవతి పేరును గుర్తు చేసుకోడానికి అయిదు నిముషాలు పట్టింది.

"నేను సత్యవతిని " అంది అతనికి గుర్తురావడం లేదని.

"ఓ! నమస్కారం. కులాసాగా వున్నారా?" అన్నాడు మందహాసం చేసి.

"మీ అబ్బాయిలా!" అనడిగింది సత్యవతి పిల్లల్ని చూస్తూ.

"మరే! వీడు పెద్దబ్బాయి శ్రీనివాస్, వాడు రెండోవాడు సోమ శేఖరం, వీడు మూడో అబ్బాయి శ్రీకృష్ణ" అంటూ చెప్పాడు.

ఇంతలో వెనకేవస్తున్న పద్మజ అతన్ని కలుసుకుంది. ఆమె చేతిలో ఏడాది పిల్ల.

"ఇది మా అమ్మాయి సువర్ణ, ఈవిడ నా శ్రీమతి పద్మజ," అంటూ పరిచయం చేసాడు.

"నమస్తే" అంది పద్మజ నవ్వుతూ.

నలుగురు పిల్లల తల్లయినా, అందంగా, ఆకర్షణగా, బంగారు తీగలా వున్న పద్మజ మీదనుంచి దృష్టి మరల్చ లేకపోయింది సత్యవతి.

"అన్నట్టు మీకు అధిక దిగుబడితో అధునాతనంగా వ్యవసాయం చేసి నందుకు ఏదో బహుమతి వచ్చిందట గదా! పేపర్లో చదివాను," అంది సత్యవతి

"ఏదోలెండి! కాలక్షేపానికి వ్యవ సాయరంగం గురించి చదువుతూ ఆ విధానాలను ప్రవేశపెడితే బాగుంటుందని పించి ఏహో ప్రయత్నించాను. దైవ కృపవల్ల అది ఫలించింది."

"అందుకని దైవదర్శనానికి వచ్చారా?"

చటుక్కున అతనికి గుర్తు వచ్చింది. ఈ దైవదర్శనానికి కారణభూతమైన ప్రత్యక్షవ్యక్తి పద్మజ అయితే పరోక్ష వ్యక్తి సత్యవతి అని, ఆనాడు ఆమెని గురించిన అపోహ, దిగులుతో పద్మజ మంచంపడితే తల్లి మొక్కుకుందని.

"లేదు, మా వారు బి. ఏ. పాసయితే రావాలనుకున్నాము. పాసైనప్పట్నించీ వెళ్ళాలనుకున్నా వీలుపడక ఇప్పుడు వచ్చాము." పద్మజ జవాబిచ్చింది.

"అలాగా ! సంతోషం."

"మీ వారు రాలేదా ?" చక్రపాణి అడిగాడు.

"ఏదీ, ఆయన కిలాంటి చోటికి రావడానికి తీరుబడి కూడానా !"

"మరే, ఆయన చదువుకుని పెద్ద ఉద్యోగాలు చేస్తున్న వ్యక్తి చీటికీ మాటికీ శెలవు పెట్టి ఎలా వస్తారాలెండి," అన్నాడు చక్రపాణి తెలిసినట్టే.

సత్యవతి నవ్వింది.

"మా ఊరు వచ్చినప్పుడు మా యింటికి రండి " అంది పద్మజ.

"మన ఊళ్లో ఏముంది చూసేందుకు! పొలాలు, పుట్రలేగా. వస్తామండీ " అంటూ నమస్కరించి, "పద పద్మా, అమ్మ ఎదురుచూస్తూ వుంటుంది," అన్నాడు.

"వస్తామండి" అంటూ పద్మజ అతన్ననుసరించింది.

వెళ్తున్న ఆ జంటను చూసి దీర్ఘ నిశ్వాసం విడిచింది సత్యవతి. తనచే విడవబడ్డ చక్రపాణి, తనని వదిలిన మదన్ అంతా బాగానే వున్నారు. తన జీవితమే చివరికి వేధనలమధ్య వంటరి దయింది. 'భగవాన్ ! దీనికి కారణం ఏమిటి ? నా అవ్యక్తతా ? లేక నా అభి జాత్యమా ? కారణం ఏదైనా చివరి వరకూ ఇక నా కీ ఒంటరితనమే నీ విచ్చిన తీర్పు' అని సజల నయనాలతో గాలిగోపురాన్ని చూస్తూ అనుకుంది.

* * *

"ఆమెని పరిచయం చేయలేదేం ? ఎవరామె," అనడిగింది పద్మజ దారిలో.

"వింటే నువ్వు బాధపడతావు."

"సత్యవతా ?"

"అవును "

"భయపడకండి ! నా బాధను, ప్రేమను మీ రర్థంచేసుకోగలరు ! అది చాలు నాకు "

"పిచ్చి పద్మా ! శ్రీ మహావిష్ణువు వక్షస్థలంలో నివసించేది శ్రీ మహా లక్ష్మి. చక్రపాణి గుండెలో గూడు కట్టుకున్నది పద్మజే !" అనురాగంగా చూస్తూ అన్నాడు.

ఆ మాటలతో పులకించిన పద్మజ 'మా సంసారం కలకాలం ఇలాగే సాగిపోనీ భగవాన్!' అని ఆ గాలి గోపురాన్ని చూసి లోపలి దేముని తలచుకుని నమస్కరించి భర్త చేయి అందుకుని కళ్ళకద్దుకుంటూ తమ కాటేజిలో అడుగుపెట్టింది. (సమాప్తం)